సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 5 । జనవరి । 2024



నాగోబా జాతరకు సన్నద్ధం

ఫిబ్రవరి 9నుంచి 15వ తేదీ వరకు కేస్లాపూర్‌లో నాగోబా జాతర నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 8లో▸



జలపాతం వద్ద సినిమా చిత్రీకరణ

కుంటాల జలపాతం వద్ద 'స్వాగ్' సినిమా చిత్రీకరణ ప్రారంభించారు. రాజు, భటుల గుర్రపు స్వారీ సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానిక కళాకారులూ నటిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/18.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. చలి తీవ్రత ఎక్కువవుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

నేరడిగొండ: అండర్-14 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రత్యేకాధికారి రజిత తెలిపారు. గురువారం కేజీబీవీలో విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్‌వెల్ఫేర్ బాలుర కళాశాలలో నిర్వహించిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో అరుగురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీఈటీ స్నేహం, కోచ్ రవి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని డీఈవో టీ ప్రణీత కోరారు. గురువారం తన కార్యాలయంలో చెకుముకి పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో ఈనెల 19న, మండల స్థాయిలో 27న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, అశోక్, సెక్టోరియల్ అధికారులు నారాయణ, సుజాత్‌ఖాన్, గోపాల్‌సింగ్ తిలావత్, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'కూనంనేని'ని కలిసిన నేతలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఎదులాపురం: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును జిల్లాకు చెందిన సీపీఐ నేతలు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లా సమస్యలు ఆయనతో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. ఆయనను కలిసినవారిలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు నళినీరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాషా, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలమ్



కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న గౌస్ ఆలమ్

ఆదిలాబాద్‌టౌన్: ఎస్పీగా గౌస్ ఆలమ్ గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీ ఉదయ్‌కుమార్ నుంచి చార్జ్ తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఎస్పీ గౌస్ ఆలమ్‌కు డీఎస్పీలు ఉమేందర్, సీహెచ్ శ్రీనివాస్, పోతారం శ్రీనివాస్, సీఐలు సత్యనారాయణ,అశోక్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా వాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న సవిత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన రాసం సవితకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆమె డాక్టరేట్ పట్టా పొందారు. కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఇవ్యాలులేషన్ ఆఫ్ నావెల్ ఎటోరిసైక్లిక్' అనే అంశంపై పరిశోధన పత్రం అందించారు. ఈమె ప్రొఫెసర్ యాదగిరి స్వామి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈమె ప్రస్తుతం మంచిర్యాలలోని ఎస్సీ గురుకులంలో పనిచేస్తున్నారు. గురువారం సవితను తల్లిదండ్రులు రాసం కిష్టు, లక్ష్మి, లెక్చరర్లు, గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

ముహూర్త బలం లేదట!

- జెడ్పీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరికపై సస్పెన్స్
- సీఎం సమక్షంలోనే అంటున్న జనార్దన్
- ఈనెల 7నలేదా 17న చేరనున్నట్లు వెల్లడి
- ఎంపీ టికెట్ అడుగుతున్నట్లు ప్రచారం
- దీంతోనే పాత నేతలు వద్దన్నట్లు పుకార్లు



మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఇతర నేతలు



హైదరాబాద్‌లో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో జనార్దన్, జిల్లా నేతలు (సర్కిల్‌లో)

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కాంగ్రెస్‌లో చేరిక విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఆయన చేరికకు లైన్‌క్లియర్ కాలేదని అంతా చర్చించుకుంటున్నారు. బుధవారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ సభ్యురాలు అరుంధతి, ఇతర నేతలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన జెడ్పీ చైర్మన్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. గురువారం ఉదయం రాష్ట్ర రాజధానిలోనే అడ్డి భోజారెడ్డి, ఇతర నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకోగా, తన చేరిక విషయంలో సమయం ఉందని, ముహూర్త బలం లేదంటూ రాథోడ్ జనార్దన్ చెప్పడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో ఈ విషయం చర్చనీయాంశమైంది.

ఎంపీ స్థానంపై గురి!

జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కాంగ్రెస్‌లోకి రావడాన్ని పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నేతలు, ప్రధానంగా ఎస్టీ నేతల నుంచి అభ్యంతరాలు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే జనార్దన్ చేరిక విషయంలో ఇంకా లైన్ క్లియర్ కాలేదని పలువురు చెప్పుకొంటున్నారు. పార్లమెంట్ టికెట్ డిమాండ్‌తో ఆయన హస్తం పార్టీలో చేరేందుకు వెళ్లడంతోనే ఇతర ఎస్టీ నేతలు ముందు నుంచి పార్టీలో ఉన్న తమ పరిస్థితి ఏమిటని అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నట్లు చర్చ సాగుతోంది. నార్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్న రాథోడ్ జనార్దన్ శాసనసభ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి గులాబీ పార్టీ టికెట్ ఆశించారు. టికెట్ దక్కకపోవడంతో ఆయన నిరాశ చెందారనే ప్రచారం ఉంది. కాగా, ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ విజయానికి పూర్తిస్థాయిలో సహకరించలేదనే అపవాదు ఆ పార్టీలో వ్యక్తమైంది. ఈక్రమంలో ఆయన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారు. అయితే ఇటు ఆసిఫాబాద్ అటు ఖానాపూర్ నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలతో సమన్వయం లేకుండానే ఆయన ఆదిలాబాద్ నేతలతో కలిసి హైదరాబాద్ వెళ్లడంపై కూడా ఆ పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది. తమను సంప్రదించకుండానే పార్టీలో చేరేందుకు హైదరాబాద్ వరకు వెళ్లడంపై వారు అధిష్టానం వద్ద విస్మయం వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో రాథోడ్ జనార్దన్ కాంగ్రెస్‌లో చేరే విషయంలో స్పష్టత లేదు.

సీఎం సమక్షంలోనే చేరిక అంటూ..



రాథోడ్ జనార్దన్, జెడ్పీ చైర్మన్

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి ఇతర నేతలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ నేతలకు సీఎం అపాయింట్‌మెంట్ దొరకకపోవటంతో సెక్రెటేరియట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. ఇక అందరూ చేరడం ఖాయమని భావించారు. అయితే డీసీసీబీ చైర్మన్, ఇతర నేతలు గురువారం ఉదయం సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాథోడ్ జనార్దన్ చేరకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జెడ్పీ చైర్మన్ జనార్దన్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ముహూర్త బలం దృష్ట్యా ఈనెల 7న, లేదా 17న కాంగ్రెస్‌లో చేరుతానని తెలిపారు. కాగా, ఆదిలాబాద్ నుంచి వెళ్లిన ఈ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరబోతున్నామంటూ హంగామా సృష్టించారు. తీరా అపాయింట్‌మెంట్ దొరకకపోవటంతో జెడ్పీ చైర్మన్ మినహా మిగతా వారంతా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకోవడం గమనార్హం.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం
- రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి
- మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు
- 'మావో' చర్యలను కట్టడి చేస్తాం
- 'సాక్షి'తో నూతన ఎస్పీ గౌస్‌ఆలమ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ గౌస్ ఆలమ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని నూతన ఎస్పీ గౌస్ ఆలమ్ పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన అనుభవంతో పాటు అందరి సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ శాతం గిరిజనులున్నారని, యువత మావోయిస్టులకు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మావోల ప్రాబల్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారినపడకుండా చూస్తామని చెప్పారు. ప్రధానంగా మహిళల భద్రతకు కృషి చేస్తామని, ట్రాఫికింగ్, డ్రగ్స్, గుట్కా, మట్కా, గంజాయి నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మరిన్ని విషయాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లాకు నూతన ఎస్పీగా వచ్చిన మీరు ప్రధానంగా ఏయే అంశాలపై ఫోకస్ పెడతారు?

ఎస్పీ: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. సామాన్యులకు పోలీసులు అందుబాటులో ఉండేలా చూస్తా. నేరాల కట్టడికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తా. దొంగతనాలు, మావోయిస్టుల ఆగడాలకు చెక్ పెట్టేలా చర్యలు చేపడతా. ములుగు జిల్లాకు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంగా ఉండగా, అక్కడ మావోయిస్టులను అణచివేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాను. ఆ అనుభవంతో జిల్లాలో ముందుకు సాగుతా. ముఖ్యంగా ప్రజలు సైబర్‌క్రైమ్ ఉచ్చులో పడకుండా అవగాహన కల్పిస్తాం.

సాక్షి: గుట్కా, మట్కా, గంజాయి, పేకాటకు ఎలా అడ్డుకట్ట వేస్తారు?

ఎస్పీ: సీఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. క్రైమ్ రేట్‌ను తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగుతా. గుట్కా, మట్కా, పేకాట, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తా. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేస్తాం.

సాక్షి: మీ ఐపీఎస్ శిక్షణ ఎక్కడ సాగింది. ఇప్పటి వరకు ఏయే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు?

ఎస్పీ: నేను ఐపీఎస్ శిక్షణ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. మొదట గ్రేహౌండ్స్‌లో పని చేశా. ఆ తర్వాత అడిషనల్ ఎస్పీగా ఏటూరునాగారంలో విధులు నిర్వర్తించాను. ఖమ్మంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా, ములుగులో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్‌గా పని చేశాను. ఆ తర్వాత ములుగు ఎస్పీగా బాధ్యతలు చేపట్టాను. ములుగు జిల్లాలోలాగే ఆదిలాబాద్ జిల్లాలోనూ గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తాను. కమ్యూనిటీ పోలీసింగ్‌పై దృష్టి పెడతాను.

సాక్షి: మావోయిస్టుల కట్టడికి ఎలాంటి చర్యలు చేపడతారు?

ఎస్పీ: జిల్లాలో మావోయిస్టుల ప్రభావం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతా. నేను ఇదివరకు పనిచేసిన ములుగు జిల్లాకు ఛత్తీస్‌గఢ్ ఆనుకుని ఉంది. అక్కడ మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. అయినా వారి కార్యకలాపాలను నివారించగలిగాను. అమాయక గిరిజన యువత ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించాం. అదే తరహాలో ఈ జిల్లాలో పనిచేస్తా.

సాక్షి: ట్రాఫిక్ సమస్య ఉంది. ఎలాంటి చర్యలు చేపడతారు?

ఎస్పీ: ఆదిలాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతా. వాహనదారులు ఎక్కడబడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయకుండా చూస్తా. వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా దృష్టి సారిస్తా. బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి.. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తాం.

సాక్షి: మహిళల భద్రతపై ఎలా ముందుకెళ్తారు?

ఎస్పీ: మహిళల భద్రత దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తా. షీటీమ్ బృందాల ద్వారా మహిళలు, యువతులు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తాం. నేరాల నియంత్రణకు పెట్రోలింగ్, గస్తీ ముమ్మరం చేసేలా చర్యలు చేపడతా. కళాశాలలు, పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువత మత్తుకు అలవాటు పడకుండా చదువుపై దృష్టి సారించాలి.

సాక్షి: ఆదిలాబాద్ పట్టణంలోని పలు చౌక్‌లలో సీసీ కెమెరాలు పనిచేయక ప్రమాదాలు జరిగినప్పుడు ఆధారాలు లభించడం లేదు. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారు?

ఎస్పీ: పట్టణంలోని అన్ని చౌక్‌లు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపడతా. ఏయే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదో తెలుసుకుని సమస్య పరిష్కరిస్తా. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయి. ప్రజలు, వ్యాపారులు వీటి ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఘటనలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీ దొరికితేనే పోలీస్ దర్యాప్తు సులువవుతుంది.

నిధులు విడుదల చేయాలి

ఎదులాపురం: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కొమురం భీం భవన్‌లో గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాడవి గణేశ్, పలువురు కార్యకర్తలు పీడీఎస్‌యూలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ సంస్థాగత ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి సంఘంలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మరింత నిర్మాణాత్మకంగా పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు ఎర్రాజీ హరీశ్, నాయకులు శ్రీకర్, పీడీఎస్‌యూలో చేరిన వారిలో నాగేందర్, అంబని, ఆత్రం అశోక్, బండు, యువరాజ్, జలపత్, విఠల్ తదితరులున్నారు.



కండువాలు కప్పుతున్న నాయకులు

క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి గురువారం ప్రవేశించారు. కుటుంబ సమేతంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీ సోయం బాపూరావు హాజరై ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఎంపీని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, నాయకులు ఆదినాథ్, అంకత్ రమేశ్, జోగు రవి, లాలామున్న, సోమ రవి, లోక ప్రవీణ్‌రెడ్డి, బోయర్ విజయ్, మయూర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు 1,71,541

- ఆరోరోజు 34,176 స్వీకరణ

కైలాస్‌నగర్: 'అభయహస్తం' ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ఆరోరోజు గురువారం నాటికి 1,71,541 దరఖాస్తులు అందాయి. గురువారం గ్రామపంచాయతీల్లో 30,955 దరఖాస్తులు రాగా, ఆదిలాబాద్ మున్సిపల్ పరిధి లో 3,221 చొప్పున మొత్తం 34,176 దరఖాస్తులు అందాయి. వీటితో కలిపితే ఇప్పటివరకు గ్రామపంచాయతీల్లో 1,29,047 దరఖాస్తులు అందగా, మున్సిపాల్టీలో 42,494 చొప్పున మొత్తం 1,71,541 దరఖాస్తులు వచ్చాయి. ఇతర పథకాలకు పంచాయతీల్లో 5,191, మున్సిపల్‌లో 36 చొప్పున 5,227 దరఖాస్తులు అందాయి. ఇప్పటివరకు గ్రామపంచాయతీల్లో 18,579, మున్సిపల్‌లో 302 చొప్పున మొత్తం 18,881 దరఖాస్తులు వచ్చాయి. కాగా, బుధవారంతో పోల్చితే గురువారం నాటికి దరఖాస్తుల సంఖ్య కొంత మేర తగ్గింది.

హైస్పీడ్ ట్రైన్ మంజూరు చేయాలి

ఎదులాపురం: జిల్లాకు హైస్పీడ్ ట్రైన్ మంజూరు చేయాలని ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ కాశవేని నారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,336 కిలోమీటర్ల రైల్వేలైన్ ఉంటే జిల్లాలో 50కిలోమీటర్లే ఉందని తెలిపారు. అది కూడా మహారాష్ట్ర నుంచి కనెక్టివిటీ ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ట్రైన్‌లో వెళ్లాలంటే 12నుంచి 14 గంటల సమయం పడుతుందని తెలిపారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మిస్తే రైలు ప్రయాణికులకు దూరభారం తగ్గడమే కాకుండా సమయం వృథా కాదని పేర్కొన్నారు. వెంటనే ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌ను ఇదే బడ్జెట్‌లో ప్రవేశపెట్టి సంవత్సరంలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు గిరిజన యూనివర్సిటీ, నవోదయ విద్యాలయం కేటాయించాలని, బేల కేంద్రంగా బాజీరావు బాబా మరాఠీ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకు ట్రిపుల్ ఐటీ, టెక్స్‌టైల్ పార్క్‌ను మంజూరు చేయాలని, ఎయిర్‌పోర్టు లేని పక్షంలో ఎయిర్ స్ట్రిప్ట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు సమస్యలు కేంద్రానికి విన్నవించి పరిష్కరించాలని కోరారు. కమిటీ జిల్లా కోకన్వీనర్ నరేందర్, నాయకులు గణేశ్, వెంకటనారాయణ, ముభారక్, లక్ష్మణ్, రాజు, మహేందర్, శ్రీనివాస్, శోభ తదితరులున్నారు.

నిర్మాణాలు పూర్తికాకుండానే ఆక్రమణలు

- తడకలు, గ్రీన్‌మ్యాట్లతో షెడ్ల ఏర్పాటు
- ప్రేక్షకపాత్రలో బల్దియా యంత్రాంగం



డైట్ కళాశాల మైదానం పక్కన స్థలం ఆక్రమించి తడకలతో వేసిన షెడ్లు

కైలాస్‌నగర్: ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ వ్యాపారాలు సాగించే ఆదిలాబాద్ పట్టణంలోని వీధి వ్యాపారుల సౌకర్యార్థం మున్సిపల్ యంత్రాంగం షెడ్ల నిర్మాణం చేపట్టింది. కాగా, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. నెలల గడిచినా తిరిగి ప్రారంభించలేదు. ఇదే అదనుగా భావించిన పలువురు నిర్మాణంలోని స్థలాలను ఆక్రమించుకున్నారు. వెదురు తడకలు, కట్టెలు, గ్రీన్ మ్యాట్‌లతో షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. బల్దియా కార్యాలయానికి ఆనుకునే ఈ తంతు జరిగినా అధికారులెవరూ పట్టించుకోకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

ఎన్నికలు ముగిసి నెలైనా..

ఆదిలాబాద్ పట్టణంలో చాలామంది రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎండ, వానతో చిరువ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బల్దియా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేలా రైతుబజార్ సమీపంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ డైట్ కళాశాల వరకు వీధి విక్రయదారుల షెడ్లతో కూడిన సముదాయాన్ని నిర్మించేలా మున్సిపాల్ కౌన్సిల్ తీర్మానించింది. రూ.28లక్షలతో 80 షెడ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. టెండర్ పొందిన కాంట్రాక్టర్ తొలుత ప్రభుత్వ డైట్ కళాశాల ప్రహరీని ఆనుకుని 57 షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఆగస్టులో ప్రారంభించి తొలుత పనులు వేగంగా చేపట్టాడు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశాడు. ఎన్నికల ప్రక్రియ ముగిసి నెలైనా తిరిగి ప్రారంభించలేదు.

పనులు నిలిచాక ఆక్రమణలు

కాంట్రాక్టర్ పనులు పునఃప్రారంభించకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న పలువురు వీధి వ్యాపారులు గురువారం వాటిని ఆక్రమించుకున్నారు. ఒకరిని చూసి ఒకరు పదుల సంఖ్యలో వచ్చి ఆ స్థలంలో వెదురు తడకలు, గ్రీన్ మ్యాట్‌లు, కట్టెలతో షెడ్లు వేసుకుని హద్దులు కూడా నిర్ణయించుకున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

వీధి వ్యాపారుల కోసమే షెడ్ల నిర్మాణం చేపట్టాం. వాటిని పూర్తి చేశాక కలెక్టర్ ఆదేశాల మేరకు లాటరీ విధానంలో కేటాయించాలనుకున్నాం. ఇంతలోనే కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించినట్లు తెలిసింది. ఇది నిబంధనలకు విరుద్ధం. ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతాం.

– శైలజ, మున్సిపల్ కమిషనర్

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థిని చదివిస్తున్న డీఈవో ప్రణీత

బేల: పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం సిర్సన్న గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో కొనసాగుతున్న తెలుగు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. దీంతో పాటు బేలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బేలలోని కేజీబీవీతో పాటు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పలు రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో సిలబస్‌పై మాట్లాడి, పుస్తక పాఠ్యాంశాలను చదివించి అభ్యసన స్థాయిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు స్పష్టమైన ఉచ్ఛరణ, దారాళంగా చదవడం, దోషాలు లేకుండా రాయడం వచ్చినప్పుడే తెలుగు భాషలో పట్టుసాధిస్తారని తెలిపారు. తద్వారా మిగతా సబెక్టులను సులభంగా అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు. సబెక్టుల పరంగా సందేహాలుంటే ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు కోల సర్సింలు, మహాలక్ష్మి, డీఆర్పీ చరణ్‌దాస్, కేజీబీవీ ప్రత్యేకాధికారి గేడాం నవీన, సీఆర్పీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలి



మేనేజర్ కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

కుంటాల: బీడీ కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్నాయని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు డాకూర్ తిరుపతి ఆరోపించారు. దోపిడీని అరికట్టాలని కుంటాల మండలం కల్లూర్ దేశాయి బీడీ పరిశ్రమలో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. సంస్థ తయారుచేసిన ఉత్పత్తులను తీసుకోవాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, నాయకులు బర్కుంట గంగారాం, చందుల సాయికిరణ్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాప్ సీజ్!

ముధోల్: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని విజయలక్ష్మి ఫర్టిలైజర్ షాప్‌ను వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ సీజ్ చేశారు. రైతులకు యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేశారు. అధిక ధరలకు విక్రయించినట్లు తేలడంతో షాప్‌ను సీజ్ చేశారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాథు

ఉట్నూర్‌రూరల్: అడవిపందుల దాడిలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సాలెవాడ (కే) గ్రామానికి చెందిన రైతు పద్వాల్ నాథు బుధవారం రాత్రి పంటచేనుకు కావలాగా వెళ్లాడు. అడవిపందులు దాడి చేయడంతో గట్టిగా కేకలు వేశాడు. అరుపులు విన్న చుట్టు పక్కల రైతులు ఇంద్రవెల్లి ఆస్పత్రికి తరలించారు. రైతులపై అడవిపందుల దాడులు అధికమయ్యాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడితో పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఓ యువకుని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పత్తం అభిరామ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి రైలుమార్గం ద్వారా గంజాయి తీసుకువస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గురువారం రైల్వేస్టేషన్‌లో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 68 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జలపాతం వద్ద సినిమా చిత్రీకరణ

గుర్రపు స్వారీ చేస్తున్న హీరో విష్ణు



భటుల వేషధారణలో కుంటాల యువకులు



హీరో కిరిటీ



నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం వద్ద గురువారం స్వాగ్ చిత్ర నిర్మాణ షూటింగ్ జరిగింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విష్ణు, కిరిటీ హీరోలుగా రీతువర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భటుల పాత్రలో కుంటాల యువకులు నటిస్తున్నారు. జలపాతం వద్ద రాజు, భటులపై సన్నివేశం చిత్రీకరించారు. ఈ చిత్రం పూర్వ కథ నేపథ్యంలో నిర్మిస్తున్నట్లు డైరెక్టర్ అషిత్‌గోలి తెలిపారు. అటవీ శాఖ అధికారులు వారికి సూచనలు చేశారు. ఇందులో ఎఫ్ఎస్ఓ వసంత్‌కుమార్, ఎఫ్‌బీవో సచిన్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరకు సన్నద్ధం



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర
- 12న నాగోబా దర్బార్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఐటీడీఏ పీవో సమీక్ష
- భక్తులకు ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు
- జాతరకు మంత్రులు వచ్చే అవకాశం ఉందన్న రాహుల్‌రాజ్



నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవం, పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో మెస్రం వంశీయులు బస చేసే గోవడ్ స్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. గతేడాది శాఖల వారీగా చేసిన ఏర్పాట్ల వివరాలు పరిశీలించారు. ఈ ఏడాది చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రణాళిక తయారుచేసి నివేదిక అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా 12న నాగోబా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల మంత్రులు రానున్నట్లు తెలిపారు. శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గోవడ్ వద్ద, మర్రిచెట్టు, పోలీస్ క్యాంపు, జాతర నిర్వహణ స్థలాల్లో తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు, మెండపల్లి నుండి నాగోబా ఆలయం వరకు, హర్కపూర్ చౌక్ నుండి కేస్లాపూర్ వరకు రోడ్లకు మరమ్మతు చేయాలన్నారు. ఈ పనులన్నీ ఈనెల 30 లోగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందువల్ల ఈసారి జాతరకు మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పగించిన బాధ్యతలను గడువు లోగా పూర్తి చేసి జాతర విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఆదివాసీ నాయకుడు ఆర్క ఖమ్ము మాట్లాడుతూ గత జాతరలో దొంగతనాలు, మట్కా జూదం వంటి సంఘటనలు జరిగాయని, ఈసారి అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని కలెక్టర్, పీవోను కోరారు. జాతరలో దుకాణలు ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల ధర ఏటా పెంచుతుండడంతో వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. దీనిపై కూడా ఆలోచించాలన్నారు. జాతరలో వచ్చే ఆదాయం, ఖర్చులను సామాన్య ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులో నమోదు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఈసారి పోలీసు బందోబస్తు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రామకృష్ణ, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశ ఉద్యోగులు మనోహర్, సోనేరావ్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణంలో లోపించిన నాణ్యత

- కట్టిన మరుసటిరోజే కూలిన బేస్‌మెంట్



కుంగిన బేస్‌మెంట్

పెంబి: నాణ్యత లోపంతో గ్రామ పంచాయతీ భవనం బేస్‌మెంట్ కట్టిన మరుసటిరోజే కూలిన సంఘటన మండలంలోని తాటిగూడలో చోటు చేసుకుంది. మండలంలోని తాటిగూడలో రూ.20 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ నాణ్యత లోపంతో పనులు చేపట్టడంతో భవనం బేస్‌మెంట్ నిర్మించిన మరుసటిరోజే కూలిపోయింది. గ్రామస్తులు సదరు కాంట్రాక్టర్‌ను నిలదీయడంతో కట్టిన వెంటనే నీళ్లు పట్టడంతో ఇలా జరిగిందని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై సంబంధిత ఏఈని ఫోన్ ద్వారా సంప్రదించగా భవనానికి ఉండాల్సిన పిల్లర్లు బాగుంటే సరిపోతుందని, బేస్మెట్ అవసరం లేదని సమాధానం ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. బేస్మెట్ కూలిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా ఏ అధికారి పరిశీలించలేదని, కాసులకు కక్కుర్తి పడి ప్రజాధనాన్ని మింగేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్, ఏఈపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై 'సాక్షి' పీఆర్ ఏఈ అన్వర్‌ని ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు. సర్పంచ్ తానాజీ, గ్రామస్తులు రాజేందర్, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

ముధోల్: ముధోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో జిల్లా కబడ్డీ అసోషియేట్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 200(70 మంది బాలికలు 130 మంది బాలురు) మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 24 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపికచేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 14న సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని జిల్లా క్రీడల అధికారి నఫేఖాన్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజేందర్, పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ సాయినాథ్, అసోషియేషన్ సెక్రెటరీ సునీల్, జాయింట్ సెక్రెటరీ కె.రాముగౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రేమలత, పలు పాఠశాలల పీఈటీలు, పీడీలు పుష్పలత, సంజీవ్, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అటవీ గ్రామాలను తరలించాలి

- ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జు



పునరావాస కాలనీ పనులను పరిశీలిస్తున్న బొజ్జు

కడెం: కవ్వాల్ టైగర్ జోన్ నుంచి రాంపూర్, మైసంపేట్ గ్రామాలను నిబంధనల ప్రకారం తరలించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీలో ఇళ్లను గురువారం పరిశీలించారు. ఇళ్లు నాణ్యతగా లేవని ఇటీవల రాంపూర్, మైసంపేట్ వాసులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి, పునరావాస ప్రక్రియ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

గోండుగూడ వాసులకు న్యాయం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ వాసులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. గోండుగూడలోని పోడు భూములను పరిశీలించారు. రాంపూర్, మైసంపేట్ వాసులతోపాటు గొండుగూడ వాసులకు పోడు భూములు దక్కేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీపీ అలెగ్జాండర్, కాంగ్రెస్ నాయకులు వాజీద్‌ఖాన్, ఇందూర్‌నేత, సత్తెన్న, సత్యం తదితరులు ఉన్నారు.

'ఆళ్వారుల సంప్రదాయ పరిరక్షణనే లక్ష్యం'



దీపోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ దంపతులు

నిర్మల్‌టౌన్: ఆళ్వారుల సంప్రదాయ పరిరక్షణమే ఏడీపీపీ (ఆళ్వారు దివ్య ప్రబోధ ప్రాజెక్టు) లక్ష్యమని టీటీడీ పర్యవేక్షకులు వంశీకృష్ణమాచార్య అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో స్థానిక దేవరకోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో రామకన్నన్ స్వామివారిచే నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని దశదిశలా వ్యాప్తి చేసేందుకు ఏడీపీపీ కృషి చేస్తోందన్నారు. భక్తులు ఈ ప్రవచనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేవరకోటలో దీపోత్సవం

జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో గురువారం దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని గుత్తి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమెడ శ్రీధర్, అర్చకులు నవీన్, గోపి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

- ఇరువురికి గాయాలు
- వన్‌టౌన్‌లో కేసు నమోదు





దాడిలో గాయాల పాలైన యువకులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని డైట్ మైదానం వద్ద గురువారం యువకులు ఘర్షణకు దిగారు. మావల సమీపంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేసే ఇద్దరు యువకుల మధ్య ఉన్న పాత గొడవలే ఈ దాడికి కారణంగా చెప్పుకుంటున్నారు. ఇందులో నుంచి ఓ యువకుడు మధ్యాహ్న సమయంలో డైట్ గ్రౌండ్‌లో క్రికెట్ చూస్తుండగా మరో యువకుడు తన స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో ఇరువురు రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన యువకులు స్నేహితులను పిలవడంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు గమనించి వారిని నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. విడిపించడానికి వెళ్లిన ఓ యువకుడికి సైతం గాయాలయ్యాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై వన్‌టౌన్ పోలీసులను సంప్రదించగా కజ్జర్లకు చెందిన వేణుకుమార్, తిర్పెల్లికి చెందిన ఆశిష్ వేర్వేరుగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు సంజీవ్, సతీష్, మధుకర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదైనట్లు ఎస్సైలు ఉదయ్‌కుమార్, నారాయణ తెలిపారు. ఇద్దరు గొడవ పడుతుంటే తాము విడిపించేందుకు వెళ్లామని, దీంతో వారు తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం ఇంద్రానగర్‌కు చెందిన గద్దల వెంకటేశ్ (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. అతని భార్య లక్ష్మి ఇటీవల క్రిస్మస్ వేడుకలకు కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితమే అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి గురువారం డిశ్చార్జి కావడంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గిజిగాడి గూడు... నైపుణ్యం చూడు



బావిలోకి వేలాడుతున్న, గిజిగాడు అల్లిన గూళ్లు

- ఇంజినీరింగ్ నైపుణ్యం 'గిజిగాడు పక్షి' సొంతం..
- నేడు జాతీయ పక్షుల దినోత్సవం



గూడులో 'గిజిగాడు పక్షి'

నిర్మల్ ఖిల్లా: అత్యద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో 'గిజిగాడు పక్షి' నిర్మించిన 'వేలాడే గూళ్లు' చూపరులను అబ్బురపరుస్తున్నాయి. నిర్మల్ రూరల్ మండలంలోని కొట్ల(కె) నుంచి జాఫ్రాపూర్ వెళ్లేదారిలో ఓ వ్యవసాయ బావికి ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలకు ఏర్పాటు చేసుకున్న గూళ్లు ఆ దారివెంట వెళ్తున్న వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ పక్షిజాతిలో మగపక్షి మాత్రమే చక్కని ఇంజినీరింగ్ ప్రతిభతో అందంగా గూడును అల్లి ఆడ గిజిగాడిని ఆకర్షిస్తుంది. ఆడపక్షికి ఆ గూడు నచ్చితే అందులో ఆవాసం ఏర్పరుచుకుని మగపక్షితో సహవాసం చేస్తూ జీవనం గడుపుతుంది.

ఎంతో నేర్పరితనం..

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కలిగి ఉంటుంది. గూళ్లు అల్లడం, పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కోవడం.. పాములు, ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లనూ పిల్లల్నీ కాపాడుకోవడానికి గూళ్లను ముళ్లచెట్లపైన, నీటికి దగ్గరగా కిందకు వేలాడేరీతిలో కట్టుకోవడం వీటి అద్భుతమైన తెలివికి నిదర్శనం. నేడు 'జాతీయ పక్షుల దినోత్సవం' సందర్భంగా 'సాక్షి' ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించింది.

కొంగ 'వల'లో చేప చిక్కకుండా..



చెరువుల్లో చేపలను పట్టేందుకు సాధారణంగా వలను ఉపయోగిస్తారు. కానీ ఇక్కడ వాటి రక్షణ కోసం ఓ రైతు వలను ఉపయోగిస్తుండటం ఆసక్తికరంగా మారింది. జైనథ్ మండలంలోని తర్నం గ్రామానికి చెందిన బోయర్ లక్ష్మణ్ తనకున్న ఎకరం నర చేనులో చేపల చెరువును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో వేసిన చేపలను కొంగలు తినకుండా ఉండేందుకు ఇలా చేపల వేటకు ఉపయోగించే నెట్‌నే రక్షణ కవచంగా ఏర్పాటు చేశాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్